# ఓ పూచిన పువ్వు

'కళాసాగర్' సావెనీరుకు కథ రాయడమంటే బాగా ఆలోచించి రాయాలి కారణం అది మేధావుల పీఠం.

అయితే ఈ మారు మామూలు కథ ధోరణి మార్చి కథ రాశాను. నామీద ప్రభావం చూపిన వారిలో మహారచయిత శ్రీ గుడిపాటి వెంకట చలంగారు ఒకరు. వారి ముద్ర నాలో వుంది

కొన్ని నెలల క్రితం వారితో నేనూ ఉత్తరాలు నడిపాను. వారి ఆశీస్సులూ నాకు లభించాయ్.

కొన్నేళ్ళ క్రితం శ్రీచలం "ఓ పూవు పూసింది" అనే ఓ గొప్ప కథ రాశారు. ఆ కథ, శ్రీచలం – స్ఫూర్తితో నేను ఈ కథ రాసి వారి మధురస్మృతికి అంకితం ఇస్తున్నాను.

మీ

జయంపు కృష్ణ

---

ఆకుల్లోపలి మొగ్గ లోకంవైపు చూస్తూ–నవ్వి నవ్వి కళ్ళు తెరిచింది—

ఓ పువ్వు పూచింది....

ఆ రెమ్మ, ఆ కొమ్మ, ఆ చెట్టు, ఆ గట్టు—కుసుమ ప్రసవ వేదనను పాలు పంచుకున్నాయ్—

పువ్వు పుట్టింది.... పరిమళించింది. తను పుట్టిన చెట్టుకే కాక; చుట్టంతా పంచింది.

గాలి వీచింది; జోల పాడింది.

ఆ 'బాల' ఆకాశంవైపు చూస్తూ, ఆమని ఆహ్లాదాన్ని అనుభవిస్తూ, అలా.... అలా.... క్షణాల్లో ఎదిగింది; సిగ్గు మదిలో ఒదిగింది.

కోవెల, కోయిల; ఊరూ, సెలఏరూ – అన్నీ.... ఆకుమాటు పువ్వు 'పుష్పవతి' అయిన అపూర్వ దృశ్యానికి ప్రేక్షకులయ్యాయి.... వెలుగు పుట్టినట్లు; వేలుపు పుట్టినట్టు.

పుష్పం వారడేసి కళ్ళతో అలవోకగా ఈ లోకాన్ని చూసింది. ఆ చూపులో ఎన్నో ఊహలు; వెన్నెల వాకలు....

"అమ్మో! ఎంత అందంగా వుందీ లోకం"— అనుకుంటూ కనురెప్పలను రెపరెపలాడించింది.

"నీకంటే నా?"—కంఠమెత్తి పలికింది కోయిలమ్మ.

ఇంతలో....

పన్నీటి జల్లులా సన్నగా వర్షం కురిసింది. పువ్వును హర్షంలో ముంచింది.

మొదట....

ఆ స్పర్శకు పూబాల నిలువెల్లా సిగ్గు పారాడింది; రేకుల్లోనూ, రెప్పల్లోనూ రక్తం జీరాడింది.

క్రమంగా.... తియ్యని హాయిని పంచి యిస్తున్న చినుకుల్లో అభ్యంగన స్నానం చేయసాగింది ఒక్కొక్క చినుకుపడి ఒళ్ళంతా తడుముతుంటే; వయసులోని చిరువేడి పరువాలను తరుముతూంటే.... ఓపలేని తాపమేదో మేనుచుట్టు మెరుపులైతే ... నగ్నంగా ఒళ్ళంతా ఒకసారి చూసుకుంది; కళ్ళు వాలవనుకుంది.

జలకాలు ముగించాక ముత్యంలా, సత్యంలా వుంది; ముచ్చటగా ముస్తాబయింది.

మరో నిముషంలో.... ఏదో రొద?

అనిమిష అయ్యింది పువ్వు.

అతృతగా యిటే వస్తోన్న తేనెటీగ నవ్వు!

"అదేమిటీ? అంత గొడవచేస్తూ, వింతగా కూస్తూ ... నా వైపే వస్తూందీ??"—అని మదిలో అనుకొని, ఆకుల్లో దాక్కోవాలని తపన పడసాగింది. కానీ, అది కుదరునూలేదు; అంత మాత్రాన తేనెటీగ బెదరనూలేదు.

దరిచేరగనే, "నువ్వు కావాలి.... నువ్వు కావాలి" అని మంత్రం జపిస్తున్నట్టు యంత్రంలా పువ్వు చుట్టూ గిరగిరా తిరుగుతోంది; దాని మిసమిసను కసికసిగా చూస్తోంది. పైట లాగబోతుంది; పైన వాల బోతోంది.

"అమ్మో! తనను స్పర్శించబోతోంది తులువ? తనలోకి చోటు చేసుకోవాలనుకుంటోంది పలువ?"— ముకుళించుకోబోయింది పువ్వు. వీలుకాలేదు; కాలు కదలలేదు.

చిరునవ్వు నవ్వింది తేటియ.

చిన్నబుచ్చుకుంది పూచేటియ

"వీల్లేదు. అది తనపై వాలడానికి వీల్లేదు తను అపవిత్రం కావడానికి వీల్లేదు"—గిజగిజలాడుతోంది పూబోడి హృదయం. రెపరెప లాడుతోంది వేటగాడి పరువం; గమ్మత్తుగా గాలి అల జాలిగా తన చేతులు చాపింది; పూబాలను పట్టుకొని, అటు యిటు ఉయ్యాల ఊపింది; పోరగానికి అందకుండా, పువ్వు సొగసు కందకుండా. తేటియ విసుక్కుంది

కిసుక్కున నవ్విన ప్రక్క చెట్టు కొమ్మమీద విరగబూసివున్న మరో పువ్వుమీద వెళ్ళి వాలింది.

దాని వళ్ళంతా, కప్పేసి, రేకులన్నీ విప్పేసి, తొండాన్ని చొప్పించి, లోని మకరందాన్ని పీల్చుకోసాగింది—

తనను వదిలినందుకు గుండెనిండా వూపిరి పీల్చుకున్న ఈ చిన్నారి పొన్న—దాపులో ఆ అన్నులమిన్న పై జరుగుతున్న కృత్యాన్ని చూసి. గుభేలుమంది.

"తనూ అలా కావలసిందేనా?"—

పువ్వు రెప్పల కింద ఊరి, ఉబికి; రేకులపైకి జారిన కన్నీళ్ళు-మృదువైన చెక్కిళ్ళను తడిపాయి....చెక్కిళ్ళను తడిమాయి.

'తనలో తీరిన అందం, లోలోన ఊరిన మకరందం— ఆ దూరాన ఆలయంలో కొలువై వున్న దేవునికే అంకితం కావాలి. తను ఆ ఈశ్వరుని పాదాల పూజకు అర్పణ కావాలి. అదే తన ఆశ; శ్వాస. తన జీవితం వ్యర్థంకాదు; కాకూడదు. తన జన్మ చరితార్థం కావాలి. అందుకోసమే పుట్టింది. ఆ క్షణం కోసం నిరీక్షిస్తోంది. ఆ తీరం చేరేనా? తన కోరిక తీరేనా?' అంతరంగంలో అనంత ఆరాధనాభావం, వెయ్యి దీపాలు; కోటి రూపాలు.

ఆ కలతలోనే, ఆ నలతలోనే....మగత సోకింది; మధుర భక్తి పాకింది.

మత్తును తెంచుకుని; మనసున దీపాలు వెలిగించుకుని- కళ్ళు తెరిచింది ఆ కన్య.

'తనలోని వేదన ఎవరు వింటారు? తనను ఎవరు ఈశ్వరుని పద సన్నిధి చేరుస్తారు?' — అని ఎదురు చూడసాగింది; అదురు వీడి నిలిచింది.

అంతలో—

ఒక పెనుగాలి లేచింది. అటువైపు వీచింది.

పువ్వు పట్టు తప్పింది.

కెవ్వుమంటూ రాలింది.

"— ఏమయ్యాయి ఆలోచనలు? దేవాలయం ఎక్కడ? తను రాలింది; తనువు వాలింది ఎక్కడ?"— అని వాపోతూ— పడిన ప్రదేశాన్ని చూసి, విస్తుపోయింది.

తను— అంతవరకూ గమనించని — చెట్టు మొదట కుదిరివున్న దివ్యమంగళమూర్తి పాదములపై వుంది.

పువ్వు పులకరించి పోయింది; "భగవాన్!" అని పలకరిస్తూ, ఆ స్వామి అరుణచరణాలను ప్రేమగా స్పృశిస్తూ....

విద్వలాసంగా నవ్వింది;

చివరి శ్వాస విడిచింది—

*

